అపరాధి ?

ఏ. వీ. మోహన్రావ్

బ్రాందీ గ్లాసు చేత్తో పుచ్చుకున్నాడు వరహాలరాజు. ఎదురుగా వయ్యారాలు వొలకబోస్తూ అర్ధనగ్నంగా అలవోకగా సోఫాలో కూర్చునుంది మణి.

"ఆగారేం? త్రాగండి!" అంది గోముగా.

"త్రాగుతాను నిన్నూ, దీన్ని కలిపి త్రాగుతాను మణీ!" అంటూ గుటుక్కున గ్లాసెడు బ్రాందీ గొంతులో ఒక్కసారిగా పోసుకుని మ్రింగాడు రాజు.

మణి సోఫాలోంచి దిగింది. పొడవుపాటి తెల్లటి నున్నటి తొడలు, పిక్కలు, మెడ, చెంపలు ట్యూబ్ లైటు వెలుగులో మిలమిలలాడాయి. తిన్నగా వెళ్ళి రాజుగారి ఒళ్ళో కూర్చుంది.

"నువ్వు నా దగ్గరకొచ్చి రెండేళ్ళయినా ఎప్పటికప్పుడు క్రొత్తగానే వుంది!" అన్నాడు ఆమెకు చక్కిలిగింతలు పెడుతూ.

"అలాంటిభావం మీ కేర్పడటానికి నేనెంత తంటాలు పడుతున్నానో మీకేం తెలుస్తుంది. సిగ్గువిడిచి అడిగినా మీరుమాత్రం నా చిన్న కోరిక తీర్చటం లేదు" అంది మణి.

"కోరికా? ఏమిటది?"

"బెంజ్ కారు కొనిమ్మన్నాను. ఇంతవరకు కొననేలేదు."

"ఓష్! అంతేగా! రేప్పొద్దుటికి నీ బంగళా పోర్టికోలో వుంటుంది. అలా జరగకపోతే నేను నీకు కనుపించను" అన్నాడు రాజు.

"అంతపని చెయ్యకండి, కారు లేకుంటే పోయింది. మీరు రండి. మిమ్మల్ని చూడకుండా నే నుండలేను" అంది మణి.

వరహాలరాజు కా మాటలు తగల వలసిన చోట తగిలి పిచ్చెక్కించాయి. కట్టుకున్న భార్యతో ఇరవై సంవత్సరాలు కాపురం చేశాడు. నలుగురు పిల్లల్ని కన్నాడు. ఒక్కనాడైనా ఆమె మణి ఇచ్చిన ఆనందాన్ని ఇవ్వలేదు. కనీసం మణిలా తనపట్ల ప్రేమ కనపరచలేదు.

మణిని వుంచుకొన్నందుకు రాజుగారికి గర్వంగా వుంది ప్పుడు. ఆమెకు రెండు లక్షలుపెట్టి బంగళా కొన్నందుకు గానీ, నాలుగైదు లక్షలు ఖరీదుచేసే నగలు బహూకరించి నందుకుగానీ, వారికి విచారం లేదు. తనకున్న ఆస్తిపాస్తుల్లో ఆమె కిచ్చింది వెయ్యోవంతు. కానీ మణి! తన సర్వస్వం దాచుకోకుండా దోచి పెడుతుంది.

వేలి దగ్గరున్న బటన్ నొక్కింది మణి. లైట్లారిపోయాయి. చీకటి చిక్కగా పేరుకుంది.

2

"బాబూగారూ! ఈ చెక్కుపైన సంతకం చెయ్యండి," అన్నాడు మానేజర్ సుందరం, వరహాల రాజుగారి మొదటి అబ్బాయి మురళితో.

"మూడు లక్షలా! ఎందుకండీ ఇంతడబ్బు!" అడిగాడు మురళి చెక్కుపైన సంతకం చేస్తూనే.

"అయ్యగారు అర్జంటుగా మణిమాలగారి పేరుమీద ఒక బెంజ్ కారు కొని తెమ్మని ఉత్తరువు చేశారు. మూడు లక్షలకు తక్కువగా ఎక్కడా కుదరలేదు" అన్నాడు సుందరం చెక్ బుక్ తిరిగి అందుకుంటూ.

"అవసరానికి దొరికింది! అంతేచాలు వెంటనే వెళ్ళండి" అన్నాడు మురళి.

సుందరం వెళ్ళిపోయాడు.

"మీ మేనేజర్‌కున్న తెలివి మీకుంటే నేనూ నా పిల్లలు కాస్త సుఖపడి వుండేవాళ్ళం" అందుకుంది వెనుక నుంచి అప్పుడే అడుగుబెట్టిన మురళి భార్య సుజాత.

"నీ తెలివి ముందందరి తెలివీ తీసికట్టేగా? అయినా ఇప్పుడేం జరిగింది?" అడిగాడు మురళి నవ్వుతూ.

"ఆ ముసలాయన ఈ వయస్సులో తన సంతోషంకోసం లక్షలు లక్షలు తగలేస్తూంటే మీరు తప్పని చెప్పరేమండీ! అంతా ఊడ్చుకుపోయాక ఏడిస్తే ఏం లాభం? ఆ పాడు ముండను తెచ్చి ఎస్టేట్‌లోనే బెట్టి కులకడానికి ఆయనకు సిగ్గులేకపోయిందో నాకు అర్థం గావటం లేదు," అంది సుజాత.

"సుజా! అనవసరంగా నోరు పారేసుకోకు. ఇది వారి ఆస్తి. వారనుభవించగా మిగిలితేనే మనం అనుభవిద్దాం లేకుంటే ఇంకోదారి చూసుకుందాం. అంతే!" అన్నాడు.

సుజాతకు చిర్రెత్తుకొచ్చింది. కళ్ళు కోపంతో ఎర్ర

బడ్డాయి. ముక్కుపుటాలు లావెక్కాయి.

"అలాంటి దుస్థితి నేను ప్రతికుండగా రానివ్వను!" అంది.

"అది మనచేతిలో లేదు!" అన్నాడు మురళి.

"ఉంది ఆ మణిమాలను స్వర్గానికి పంపిస్తే సరి," అని అక్కడొక్క క్షణమైనా వుండకుండా చకచక వెళ్ళిపోయింది.

మురళి విస్తుపోయి చూస్తూ నిలుచున్నాడు.

"అన్నయ్యా!" అని పిలవటంతో ఇహంలో కూడి పడ్డాడు మురళి. ఎదురుగా చిన్న తమ్ముడు హరనాథ్ కనుపించాడు.

"ఏంట్రా హరీ!" అడిగాడు.

"ఏం లేదు. నాకు అర్జంటుగా ఐదు లక్షలు కావాలి."

"అంత డబ్బెందుకురా?"

"నేను మద్రాసు వెళ్ళి సినిమా తీద్దామనుకుంటున్నాను."

"ఉన్న వ్యాపారాలు చాలక మళ్ళీ అదొకటెందుకు. అయినా అంత డబ్బు నాన్నగార్ని అడగకుండా ఇచ్చే అధికారం నాకులేదు. నువ్వు ఓ మారు నాన్నగార్ని కలుసుకుని వారికి నచ్చచెప్పించు. ఐదుకాదు పది లక్షలిస్తాను," అన్నాడు మురళి.

"నీకు చెప్పాగా? చాలదూ? మళ్ళీ ఆయన కెందుకు. ఆయనతో మాట్లాడాలంటే దాని కొంపకు పోవాలి. అది నా కిష్టంలేదు" అన్నాడు హరనాథ్.

"అలాగే హరీ! ఆమెకోసం నువు పోవడం లేదు. నాన్నగారికోసం పోతున్నావు. ఆమెను అలా కించపరచి మాట్లాడటం నాన్నగారు వింటే సహించరు," అన్నాడు మురళి.

"అయితే నేను నాన్నను కలుసుకోక తప్పదంటావ్"

అడిగాడు హరనాథ్

"తప్పేదు బాబూ! నా పరిస్థితి నీకు వివరించానుగా" అన్నాడు మురళి.

"అసలు ఆ ముండను అంతం చేస్తేగాని నాన్నగారు ఇంటికిరారు. ఆయన ఇంటికొస్తేగాని, నేను మాట్లాడే వీలు లేదు," అంటూ వెళ్ళిపోయాడు హరనాథ్.

అవాక్కయి చూస్తూ నిలుచున్నాడు మురళి.

3

పోర్టికోలోవున్న బెంజ్ కారు వెనకగా ఆగింది ఇంపాలా కారు. వెనుక డోర్ తెరుచుకుని దిగాడు మురళి. ముందున్న కారువంక తదేకంగా నిమిషం సేపు చూసి బంగళాలోనికి నడిచాడు. హాల్లో మాటలు వినబడుతున్నాయి. ముందుకు పోవడం మాని వెనక్కి నిలుచున్నాడు.

"నా మాట నమ్మండి. దాని ఖరీదు నిజంగా మూడు లక్షలు" అన్నాడు సుందరం.

"నీ చరిత్ర నాకు తెలీదనుకోకు. నా మాటపైనే నిన్ను మానేజర్‌గా పెట్టుకున్న విషయం మరచిపోకు. రెండు లక్షలకు కొని మూడు లక్షలని చెప్పి లక్ష రూపాయలు కాజేశావు కదూ!"

సుందరం మాట్లాడలేదు.

"నమ్మిన వాళ్ళను అలా మోసం చెయ్యడం మగవాడికి తగనిపని. నీ అసలు రంగు బయట పెడితే పిచ్చి కుక్కను కొట్టినట్టు కొట్టి చంపుతారు. ఇకనైనా అలాంటి పనులు చెయ్యకద్దు," అంది మణి.

అందుకూ సుందరం సమాధానం చెప్పలేదు.

"ఆ లక్షలో పాతిక వేలుంచుకో. మిగతాది తెచ్చి యివ్వు. గంట టైమిస్తున్నాను. ఈలోగా తేకుంటే అయ్యా

గారితో చెప్పి నిన్ను తగిన విధంగా సన్మానించే ఏర్పాట్లు చేయిస్తాను. సరేనా?"

"తేస్తాను. గంటలోగానే వస్తాను" అన్నాడు సుందరం.

గోడవారగా నిలుచున్న మురళిని దాటుకుని చకచక వీధిలోకి వెళ్ళిపోయాడు.

అతన్ని ముందుకు పోనిచ్చి మురళి హాల్లో కడుగుబెట్టాడు. మణి చూచింది. ఆశ్చర్యపోతూ "మీరా బాబూ!" అంది.

"అవును" అన్నాడు మురళి.

"కూర్చోండి!" అంది మణి.

మురళి కూర్చున్నాడు.

"ఏమిటిలా వచ్చారు? నాన్నగారితో ఏదైనా అర్జంటు పనుందా?"

"లేదు. మీతోనే రెండు నిముషాలు మాట్లాడుదామని వచ్చాను."

"నాతోనా? దేన్ని గురించి?"

"నీ గురించే!"

"అంటే నా కర్థం కావటంలేదు" అంది మణి.

"కాదు! ఈ డబ్బు. ఈ హంగామా నీకేమీ అర్థంగా నివ్వదు. ఈ సిరిసంపదలలో బ్రతుకెంత హాయిగా వుంటుందో అంత భయంకరంగానూ, ప్రమాదపూరితంగానూ వుంటుంది. నాకు నీపైన విరోధంలేదు. కానీ నిన్ను ఎలాగైనా అంతం చెయ్యాలని అనేక మందికి ఆలోచనగా వుంది. అందరూ సమర్థులే. ఎంత ఘోరమయినా సాహసించి చేసి చట్టానికి పట్టుబడకుండా తప్పుకోగల ఘటికులే. ఈ అద్దాల మందిరంలో నువ్వొక్కతే నాళ్ళు బ్రతకలేవు. తగు జాగ్రత్తలో వుంటే ఎక్కువ రోజులు బ్రతకొచ్చు," అన్నాడు మురళి.

"మీరు నన్ను భయపెడుతున్నారా?"

"లేదు! సుందరంలాంటి వాళ్ళను భయపెట్టవద్దని చెపు

తున్నాను. ఆ భయంలో వాళ్ళేం చేస్తారో కూడా మనం ఊహించలేం. అంతే!"

"మా మాటలు మీరు విన్నారా?"

"కుతూహలం లేకున్నా విన్నాను. నేను వచ్చి వెళ్ళిన విషయం నాన్నగారికి కూడా తెలియజెయ్యి. అవసరమనుకుంటే మీకు ఇచ్చిన సలహా సంగతి చెప్పండి. వారి సుఖం కన్నా నాకు కావలసింది లేదు," అంటూ ఆమె ముందునుంచి చకచక కెనుతిరిగి వచ్చి కారెక్కాడు.

మణి మ్రాన్పడి చూస్తూ నిలుచుంది.

4

"మీ ఫొటో చూచి కళ్ళు చెదరిపోయాయి నాకు. మిమ్మల్ని చూస్తుంటే ఇప్పుడు మతే పోతూంది. ఇంత అందం ఎలా వచ్చిందండీ!" ముందు సీట్లో కూర్చున్న సుందరం, కారు డ్రైవ్ చేస్తూ ఇందిరను అడిగాడు.

ఆమె అమెరికాలో చదువు ముగించుకుని విమానంలో వచ్చింది. మద్రాసునుండి ఎస్టేటుకు పిలుచు కొచ్చేందుకు కారులో వచ్చాడు సుందరం.

"రియలీ! అంత బ్యూటీ వుందా నాలో." అడిగింది ఇందిర, మిర్రర్‌లో తన్ను చూసుకుంటూ.

"మీరే బ్యూటీ! బ్యూటీయే మీరు. అమెరికాలో మీ కెవ్వరూ చెప్పలేదా?"

"అక్కడంతా తొందర. మనుషులకు ఓపిక లేదు. ఎదుటి వాళ్ళ అందాన్ని చూచి ఆనందించ గల కాలం వాళ్ళ దగ్గర స్పేర్ గా వుండదు" అంది ఇందిర. ఆమె వ్రేళ్ళు స్టీరింగ్ వీలుమీద డాన్సు చేస్తున్నాయి.

"మీరు మా ఎస్టేట్‌లో మానేజర్ గా చేరి ఎన్నాళ్ళయింది?" అడిగింది ఇందిర.

"ఆరు మాసాలయింది."

"అంతకు ముందేం చేసేవారు?"

"ఈ దేశంలో నేపాల్ రాజాగారి ఆస్తి పాస్తుల్ని అజమాయిషీ చేస్తూ వుండేవాణ్ణి."

"వారివద్ద మానుకున్నారా?"

"లేదు. వారే నన్ను మీ నాన్నగారి వద్దకు పంపారు."

"ఐ సీ. మీరు ఫామిలీతో వుంటున్నారా?"

"నాకు పెళ్ళి కాలేదండీ! ఇంక ఫామిలీ ఎలా వుంటుంది?"

"ఐ మీన్ మదర్, ఫాదర్, సిస్టర్ ఎట్సెట్రా!"

"నాకెవరూ లేరండీ! ప్రస్తుతానికి అంతా మీ నాన్నగారే!" అన్నాడు సుందరం.

"నా కేబుల్ చూసి నాన్నగారేమన్నారు" అడిగింది ఆతృతగా.

"వారు చూడనేలేదు. వారు తమ స్వంత బంగళాలో నిద్రపోయి సంవత్సరమయింది. మీ అన్నయ్యగారే ప్రస్తుతం ఎస్టేటు వ్యవహారాలు చూస్తున్నారు."

"మీ మాటలు నా కర్థంకావటంలేదు."

"మీ రొస్తున్నారుగా! అంతా మీకై మీరే చూసి తెలుసుకుంటారు. మధ్య నేను చెప్పి, మీ మనస్సు పాడు చెయ్యడం ఇష్టంలేదు," అన్నాడు సుందరం.

కారు రక్కన పెద్ద కుదుపుతో ఆగిపోయింది.

"బ్రేక్ వేశారెందుకు?"

"అదేదో చెప్తే తప్ప నేనింటికిరాను," అంది ఇందిర.

వరహాలరాజుగారికి, మణికి ఏర్పడ్డ సంబంధంగురించి కాస్త చిలవలు పలవలు కలిపించి చెప్తూ, మణిమాలకు వరహాలరాజుగారి సంతానంపైన గుర్రుగా వుందనీ, అందర్నీ పాతమార్చేస్తే ఆస్తిమొత్తం తనకు దక్కుతుందన్న ఆలోచన చేస్తూందనీ అంటించాడు సుందరం.

"డర్టీబిచ్! దాన్ని తుపాకితో కాల్చి చంపుతాను," అంది ఇందిర.

"అలా ఆవేశపడకండి! కాల్చడం తేలికే! ఆ తర్వాత పోలీసులు, వాళ్ళ ప్రశ్నలు, జైలుజీవితం, ఇవన్నీ కూడా ఆలోచించాలి. మనం ఇంతమందిమున్నాం. ఇక దాని ఆలోచనలు సాగనిస్తామా! దాని ఎత్తులు ఎప్పటికప్పుడు నేను కనిపెట్టివచ్చి మీకు చెప్తుంటాను. మనం యిద్దరం దానికి పై ఎత్తులు ఆలోచించివేసి, దాని ఎత్తుల్ని చిత్తుచేద్దాం! సరేనా?" అన్నాడు సీట్లో కొంచెం ప్రక్కకు జరుగుతూ.

"దటీజ్ కరెక్ట్!" అంది ఇందిర కాలు ఆక్సిలేటర్ పై వేస్తూ.

మళ్ళీ కారు కదిలింది.

సుందరం, ఇందిరవంక చూస్తూ కూర్చున్నాడు. అతని మనస్సునిండా ఆమే ఆవరించింది. ఆమె నెలాగైనా లోబరుచుకుని అనుభవించాలన్న ఆలోచన బలంగా నాటుకుంది.

మరో ఐదునిముషాల్లో కారు బంగళా పోర్టికోలో ఆగింది.

"హాల్లో! బేబీ! వచ్చేశావా?" అడిగాడు హాల్లోనే ఎదురయిన మురళి చెల్లెల్ని.

"అహఁ! నాన్నగారెక్కడ?" అడిగింది తనకేమీ తెలియనట్లు ఇందిర.

"నువ్వెళ్ళి రెస్ట్ తీసుకో! నాన్నగారు వస్తారు."

"చిన్నన్నయ్యకూడా లేడా?"

"ఉన్నాడమ్మా! వస్తాడు. ముందు నువ్వెళ్ళి రెస్ట్ తీసుకో?" పురమాయించాడు మురళి.

"ఎక్కడుంటారు? ఏళ్ళొచ్చినా సిగ్గులేకుండా సాని కొంపలో పడి దొర్లుతున్నాడు మీ నాన్న దాని మొహాన లక్షలు పోస్తూ. పనీపాటు లేకుండా జులాయి వెధవలా

తిరుగుతున్నాడు మీ చిన్నన్న. ఇంటిని అంటిపెట్టుకొని వుండే ఖర్మ వీరికిమాత్రమే పట్టింది," అంది సుజాత.

"సుజా! నువ్వెళ్లు. అనవసరంగా నోరు పారేసుకుంటే ఏంలాభం?" గద్దించాడు మురళి.

"ఆడబడుచు అడిగిందికదాని, మీరు చెప్పేందుకు మొహమాట పడుతుంటే నేను చెప్పాను. అంతే! అయినా నాకెందుకు. మీరూమీరూ ఒకటే!" అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది సుజాత.

"వదినెలో మార్పేమీ లేదన్నమాట!" అంది ఇందిర.

"ఈ జన్మకు రాదు నువ్వెళ్ళమ్మా" అన్నాడు మురళి.

ఇందిర మెట్లెక్కి తన రూంకు వెళ్ళిపోయింది.

5

హాల్లో సోఫాలో కూర్చుని లంకచుట్ట అంటించారు వరహాల రాజుగారు. ఆయన చుట్టూ జనం నిలుచుని వున్నారు.

"మురళీ! అన్ని వ్యవహారాలు నువ్వు సమర్థవంతంగా చూస్తున్నావు. నాకు ఆనందంగా వుంది. డబ్బుకి కక్కుర్తి పడి మన తాతల నాటినుంచి వస్తున్న ఆనవాయితీలను జరుపకుండా వుండొద్దు. మనకు డబ్బుకన్నా ప్రతిష్ఠ ముఖ్యం. ఈ సంవత్సర కాలంలో నువ్వు చేసినదల్లా ఒక్కటే తప్పు. దాన్ని తప్పుగా నేను తీసుకోను. మొత్తం వ్యవహారాలు నువ్వే చూడాలి," అన్నాడు రాజుగారు.

"అంత బరువు నేను మొయ్యలేనండీ! తమ్ముడికూడా కొన్ని బాధ్యతలు అప్పగిస్తే నాకు సులువుగానూ ఉంటుంది, వాడూ చేతికి చిక్కుతాడు. అలాగే ఇందిర వ్యవహారం. ఆమెకేదైనా మంచి సంబంధం చూసి పెళ్ళిచేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. వీటికంతా మీరు పూనుకోవాలి" అన్నాడు మరళి.

"హరనాథ్ చెడిపోతున్నాడు. వాడ్ని దబ్బిచ్చి మనం బాగుపరచలేం. పూర్తిగా చెడ్డాక వాడే తిరిగి మంచి మార్గాన్ని ఎన్నుకుంటాడు. ఇందిర పెళ్ళి విషయం నేను చూస్తాను" అన్నాడు వరహాలరాజు.

"మీ ఇష్టం నాన్న!" అన్నాడు మురళి.

"మరో విషయం! మణిమాల నా వుంపుడుగత్తె మాత్రమే కాదు. నా ప్రాణం! ఆమెకు మీ ఎవరివల్లా ఎప్పుడూ ఏ విధమైన ఇబ్బందిగానీ, ప్రమాదంగానీ, అవమానంగానీ, జరగకూడదు. నన్ను గౌరవించినట్లే మీరంతా ఆమెను గౌరవించాలి. అర్థమయిందా?" అడిగాడు వరహాలరాజు.

మేడ దిగొస్తూ తండ్రి మాటలు విన్న ఇందిర కోపంతో కుతకుతలాడిపోయింది.

"మీరు మాకన్న తండ్రి! మిమ్మల్ని నెత్తిన పెట్టుకుంటాం. కానీ దాన్నెవర్నో గౌరవించమనటం కన్నతల్లిలా చూచుకోమనటం అన్యాయం. నావల్ల కాదు!" అంది ఇందిర.

"అమెరికాలో నువ్వు నేర్చుకొచ్చింది తండ్రిని ఎదిరించి పోట్లాడడంలాగుంది. నా మాట కాదంటే దాని ఫలితం ఏమిటో నీకు తెలుసు. జాగ్రత్త!" అన్నాడు వరహాలరాజు.

"నాకు రావలసిన వాటా ఇచ్చెయ్యండి. నా కిష్టమొచ్చిన వాణ్ణి పెళ్ళిచేసుకొని అమెరికాకు వెళ్ళిపోతాను."

"వాటా అంటూ లేవు. నాకు ఇష్టమైతేనే ఇస్తాను. లేకుంటే లేదు. నామాట కాదన్నావో నీకు చిల్లిగవ్వకూడా ఇవ్వవలసిన అవసరం నాకులేదు. ఆపైన నీదారి నువ్వు చూచుకుంటే నాకు అభ్యంతరంలేదు."

"చెల్లాయ్! నువ్వెళ్ళు. నాన్నగార్ని ఎదిరించి మాట్లాడకూడదు," అంటూ సర్దాడు మురళి.

ఇందిర మాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది.

అంతలో హరనాథ్ లోనికొచ్చాడు.

"ఏరా హరీ! నువ్వేదో సినిమా వ్యాపారం చెయ్యాలనుకుంటున్నావట" అడిగాడు కొడుకును రాజుగారు.

"అవును. మీకు అన్నయ్య చెప్పాడా?"

"లేదు! మణి చెప్పింది. నన్నెలాగైనా ఒప్పించి డబ్బిచ్చే ఏర్పాటు చేయించమని, అలా చెయ్యకుంటే చంపుతాననీ బెదరించావటగా? నిజమేనా?"

"ఆ రంకుముండ మీకంతా చెప్పిందన్నమాట. నిజమే!"

"హరీ!" పెద్దగా అరిచాడు రాజుగారు.

ఆ అరుపుకు హాలు దద్దరిల్లి అందరూ విభ్రాంతులైనారు.

"మురళీ! వీణ్ణి కాళ్ళూ చేతులూ కట్టించి చీకటి కొట్లో పారెయ్. అన్నం నీళ్ళు లేకుండా ఆరురోజులుంచు. ఆ తర్వాత చేసిన తప్పుకు క్షమాపణ చెప్పుకుంటే వదలిపెట్టు. రాస్కెల్ నా కెదురు తిరుగుతాడా?" అన్నాడు రాజుగారు.

"ఏదో చిన్న వయసు. ఆవేశంతో ఆమెగార్ని అలా అని వుంటాడు తప్ప వాడటువంటి వాడు కాదని మీకు మాత్రం తెలీదా నాన్న. నేను వాడికి సర్దిచెప్తా ఇప్పుడే వాడి చేత మీకు క్షమాపణ చెప్పిస్తాను," అన్నాడు మురళి.

వరహాలరాజు గారు మౌనంగా వుండిపోయారు.

మురళి, హరనాథ్‌ను ప్రక్కకు పిలిచి ఐదు నిముషాలు మాట్లాడాడు. ఆ తర్వాత హరి తండ్రి కెదురుగా వచ్చి నిలబడి క్షమించమని అడగడంతో ఆ గొడవ తగ్గింది.

"ఇవాల్టి నుంచి మన మైకాగనుల అజమాయిషీ హరికి అప్పగించు. డబ్బు పెత్తనం మాత్రం వాడికివ్వకు!" అన్నాడు రాజుగారు.

"అలాగేనండీ!" మురళి తలూపాడు.

"నాకవసరం లేదు. చేస్తే సినిమా వ్యాపారం చేస్తాను. లేకుంటే ఖాళీగా వుంటాను," అంటూ హరనాథ్ విసురుగా వెలుపలకు వెళ్ళిపోయాడు.

6

సీసామూత తీసింది మణి. గ్లాసులోకి బ్రాంది వంచుతూ ఎదురుగా వున్న రాజుగారికేసి చూసింది.

"మీ ఆస్తిపాస్తులు నేను దోచుకుంటున్నానని మీ వాళ్ళందరికీ అసూయగా వున్నట్లుంది. అది ఏ క్షణమైనా కోపంగా మారవచ్చు. ఆ కోపంలో నన్ను ఎవరైనాచంపుతారన్న అనుమానం కలుగుతోంది," అంది మణిభయంగా.

"అలా ఎవరైనా అన్నట్లు నీకు తెలిసిందా?"

"చంపుతామని ఇంకా బెదరించలేదు. కానీ, జాగ్రత్తగా వుండమని రెండుమూడు హెచ్చరికలు జరిగాయి," గ్లాసందించింది.

అందుకొని అమాంతం ఒక్క గుటకలో గ్లాసెడుబ్రాందీ మింగాడు రాజు. "నిన్నెవరు హెచ్చరించారు?"

"మీ రెండో అబ్బాయి హరనాథ్. అతనేదో వ్యాపారం చేసుకుంటానంటే మీరు డబ్బివ్వనన్నారట. అందుకు బాధ్యతంతా నాదేనన్నట్లుగా మాట్లాడివెళ్ళాడు" అంది మణి మళ్ళా గ్లాసునింపుతూ.

"వాడు కుర్రకుంక. ఆవేశం ఎక్కువ. వాడి మాటలు పట్టించుకోకు!" అన్నాడు రాజుగారు.

"పట్టించుకోలేదు. అయినా జరిగింది మీకు చెప్పడం మంచిదని తోచింది."

"నిన్ను హెచ్చరించిన మరో మనిషెవరు?"

"మీ మేనేజర్ సుందరం!"

"సుందరమా! అతన్ని నువ్వేగా మేనేజర్‌గా పెట్టుకోమని రికమెండు చేసింది. డిస్మిస్ చెయ్యమంటావా?"

"వద్దు. అతనుకాదు నన్ను చంపుతానన్నది. మీ అమ్మాయికి, అబ్బాయికి, కోడలికి నాపైన గుర్రుగా వుందనీ, మీ కుటుంబవ్యవహారాల్లో నేను తలదూర్చటం మంచిది

కాదనీ హెచ్చరించాడు. అంతే!" అంది మణి.

"మావాళ్ళవల్ల నీ కేవిధమైన అపాయం రాకుండా తగిన కట్టుదిట్టం చేస్తాను. ఆ విషయం మర్చిపో. హుషారు తెచ్చుకో. ఖుషీగా వుందాం!" అన్నాడు రాజుగారు.

రాజుగారిచెయ్యి ఆమె గుండ్రటి భుజంపై పడింది...

ఐదు నిముషాలకు ఇద్దరూ అలసిపోయారు. అలాగేమంచం మీద పడుకున్నారు. మగతలో మూసుకునిపోయిన కళ్లు కలతనిద్రలో కొరిగిపోయాయి.

ఠంగ్ మని శబ్దమైంది.

మణి లేచి కూచుంది. చుట్టూ చీకటి. దూరంగా నల్లటి ఆకారమేదో చకచక పరుగెత్తి బాల్కనీలోకి వెళ్ళినట్లు చూచాయగా తోచింది. ప్రక్కనున్న రాజును లేపి తను విన్న శబ్దం గురించి చెప్పింది.

రాజుగారు లైటుస్విచ్ నొక్కాడు.

తెల్లటి వెలుతురులో టీపాయిపైనున్న బ్రాందీసీసా గ్లాసుక్రిందపడి ముక్కలు ముక్కలయి వుంది.

రాజుగారు బాల్కనీలోనికెళ్ళి చూశాడు. అరంగుళాల బ్లేడున్న కత్తి కనిపించింది. చేతికి తీసుకొని చూశారు. బ్లేడుమీద గ్రీజ్ మరకలున్నాయి. అంటే క్రొత్తదన్న మాట. తనను, మణిని హత్యచేసేందుకు ఎవరో క్రొత్త కత్తి కొని పట్టుకొచ్చారు.

అంతకుముందు మణి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

అంటే, హరి మణిని చంపేందుకు సిద్ధమైనాడా? ఆ ప్రయత్నం తనపైన జరిగేందుకు వీలులేదు.

స్వసుఖంకోసం, మణిని తెచ్చుకున్నాడు తను. ఆమె యిచ్చే ఆనందానికి ప్రతిఫలంగా డబ్బురూపంలో తను ముట్టజెప్పింది తనకున్న మొత్తం ఆస్తిలో పదోవంతు కూడా వుండదు. అలాంటప్పుడు తన కొడుకులుగానీ, మరె

వరూ గానీ, ఈర్ష్యతో మణిని చంపేంత నీచానికి పాల్పడరు. మరి ఇప్పుడా ప్రయత్నం చేసిం దెవరు?

"చూశారా? ఇవాళిలాగో తప్పించుకున్నాను. నన్ను చంపంది నిద్రపోరు. తెల్లారగానే నేపోతాను," అంది మణి.

"అలాగనకు మణీ! నిన్ను అడుగడుగునా కనిపెట్టివుండి రక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాను."

"ఏమిటా ఏర్పాట్లు?"

"నమ్మకమైన మనుషుల్ని ఇంటికి కాపలా పెడతాను."

"నమ్మకమేమిటండీ! మనం నమ్మకమైన వ్యక్తులనుకొన్న వాళ్ళకీ లోగొట్టుకొని గుట్టుచప్పుడుకాకుండా గొంతు పిసికేస్తే చేసేదేముంది?"

"అలా బెంబేలుపడకు. నేను ఇక్కడే వుంటాను. మరో నలుగురు నాకు నమ్మకమున్న వాళ్ళను తెచ్చిపెడతాను. ఈలోగా మా అబ్బాయిలనికూడా ఓమారు హెచ్చరిస్తాను. నువ్వు నిర్భయంగావుండు," అన్నాడు రాజుగారు.

7

ఇందిర బట్టలన్నీ విప్పేసుకుంది. కట్ డ్రాయరు, బ్రా మాత్రమే వున్నాయి శరీరంమీద. ఎదురుగావున్న అద్దంలో తన్నుతాను చూసుకుంటూ వ్యాయామం చేయడం ప్రారంభించింది. చేతులు రెండు పైకెత్తింది. వాటిని క్రిందకుదించి కాళ్ళ బొటనవ్రేళ్ళు పట్టుకుంది నడుంవంచి. అలా నాలుగైదు సార్లు చేసింది.

గది తలుపులు మూసివున్నాయి. వెలుపలున్న సుందరం తాళంచెవి బిగించే రంధ్రంగుండా కన్నార్పకుండా లోన ఇందిర చేస్తున్న ఫీట్సు చూడసాగాడు. అతనిలో ఆమె అందం ఆవేశం రగుల్కొల్పింది.

మెల్లగా తలుపు తట్టాడు.

ఇందిర కంగారుపడుతూ, డ్రెస్సింగ్ గౌను తొడుక్కొని వచ్చి తలుపు తెరిచింది. ఎదురుగా సుందరం కన్పించాడు.

"ఏమిటండీ! ఇలా వచ్చారు!" అడిగింది.

"మీతో అర్జంటుగా మాట్లాడాలి."

"లోనికి రండి!" అంటూ ప్రక్కకు తప్పుకుంది.

"రాత్రి మణిమాలను ఎవరో హత్యచేసేందుకు ప్రయత్నించారు. హంతకుడు వెళ్ళిపోతూ తను తెచ్చిన కత్తి పారేసుకున్నాడట. మీ నాన్నగారు క్రిందహాల్లో వున్నారు. అందరిపైనా శాపాలు మిరియాలు నూరుతున్నారు. మిమ్మల్ని క్రిందకు పిల్చుకొని రమ్మని పంపారు."

"నన్నా? ఎందుకు?"

"ఏమో! తెలీదు?"

"నేను బట్టలు మార్చుకుని వస్తాను. మీరు పదండి."

"బట్టలు లేకుండానే అందంగావున్నారు. ఆ అందం చూసే అదృష్టం నాకు కలిగింది," అన్నాడు నవ్వుతూ.

"య్యూ! నాటీ! ఎప్పుడు చూశారు?"

"ఇప్పుడే! అదిగో ఆ రంధ్రంగుండా చూశాను. లోనికి రాబోయేముందు ఆ ఆవేశంలో నేనేం చేస్తానో నాకే అర్థంగా లేదు."

"మరేం చెయ్యలేదే?" క్రిందిపెదవిని పంటితో కొరుకుతూ అంది ఇందిర.

"మీరేమన్నా అంటారేమోనని భయపడి" నసిగాడు.

"అలా భయపడేవాడివి నువ్వేంచేయగలవు? అలాంటి పిరికిపందలంటే నాకు అసహ్యం" అంది ఇందిర.

ఆమె మాటలు పూర్తిగాకముందే సుందరం ఆమెపైకి సింహంలాదూకి తన బిగికౌగిట్లో ఆమెను పొదివి అదిమిపట్టుకున్నాడు. అతన్ని ప్రక్కకుతోస్తూ "ఇది సమయంకాదు. క్రింద నాన్నగారు వెయిట్ చేస్తున్నారు. ముందు మీరు

వెళ్ళండి. తర్వాత నేనొస్తాను" అంది.

"మరి మనం కలుసుకొనేది ఎప్పుడు?"

"తర్వాత చెప్తాను" అంది అతన్ని వదుల్చుకుంటూ.

ఐదు నిముషాల తర్వాత హాల్లో అంతా హాజరయినారు. వరహాలరాజుగారుమాత్రం కూర్చొని వున్నారు. మిగిలిన వాళ్ళంతా నిలబడే వుండిపోయారు.

"మీలో చాలామందికి మణిమాలపైన కోపమున్నట్లు తెలుసుకొన్నాను. ఆమె నాకు భార్యతో సమానం. నాకు మీరెలాంటి గౌరవమిస్తారో ఆమెకు అలాంటి గౌరవమే ఇవ్వాలి. రాత్రెవరో ఆమెను హత్యచేసేందుకు ప్రయత్నించారు. కానీ వాళ్ళ ప్రయత్నం ఫలించలేదు. ఆ హంతకుడ్ని మీలో ఎవరైనా పురికొల్పి పంపివుండవచ్చు. ఈమారు క్షమిస్తున్నాను. మరోసారిలా జరిగిందంటే ఆస్తంతా ఆమెపేర రాసి, ఆమెను తీసుకొని విదేశాలకు వెళ్లిపోతాను," అన్నాడు రాజుగారు.

"నాన్నగారూ! అంత నీచానికి పాల్పడే అవసరంగానీ, తత్వంగానీ మాలో ఎవ్వరికీ లేవు. మీ సుఖమే మా ఆనందం. అలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా తగిన కట్టుదిట్టం చేస్తాను," అన్నాడు మురళి.

"అమ్మ నగలు, ఇంట్లోవున్న డబ్బు అంతా ఆ మణిమాల ఇంట్లో ఉన్నట్లు దొంగలక్కూడా తెలిసిపోయి నట్టుంది. అందుకే అంత సాహసానికి తెగించారు" అన్నాడు హరి.

"నా రక్తం పంచుకొని పుట్టారు. నాకు ఆనందాన్నిచ్చేందుకు వచ్చిన ఆ అమాయకురాలిపైన అఘాయిత్యం చెయ్యొద్దని మళ్ళీ చెపుతున్నాను. అలా మీలో ఎవరైనా చేసినట్లు గానీ, చేయించినట్లుగానీ తెలిస్తే నేనేం చెయ్యదలచుకొందీ ముందే చెప్పాను. ఇంక మీరు వెళ్ళవచ్చు" అన్నాడు.

అందరూ వెళ్ళిపోయారు.

సుందరం మాత్రం అక్కడే నిలబడ్డాడు.

"మిస్టర్ సుందరం మన ఎస్టేట్‌లో పనిచేసే మెరికల్లాంటి నలుగురు వస్తాదుల్ని మణి బంగళాకు కాపలాగా వుంచు," అన్నాడు రాజుగారు.

"అలాగే నండీ!"

"నువ్వు అనవసరంగా మణిని కలుసుకోవడం, లేనిపోనివి చెప్పి, ఆమెలో భయం రేకెత్తించడం నాకు యిష్టంలేదు. అక్కడకు నీ రాకపోకలు తగ్గించు" అన్నాడు రాజుగారు.

"అలాగే సార్!"

"మరో విషయం. హరికి ఐదు లక్షలివ్వు. వాడిష్టప్రకారం ఆ వ్యాపారమేదో తగలడమని చెప్పు," అన్నాడు.

"ఇప్పుడే ఇస్తాను."

"మంచిది" జేబులో నుండి చుట్టతీసి వెలిగించుకొన్నారు.

సినిమా తీసే మిషపైన హరి వెళ్లిపోతాడు. ఇందిరకు పెళ్ళి చేసేస్తే ఆమెకూడా అత్తగారింటికి పోతుంది. ఇక మిగిలింది మురళి. తన మాటకు కలలో గూడా ఎదురు చెప్పి ఎరుగని పితృ వాక్య పరిపాలకుడు. అతనివల్ల మణికి ఏ విధమైన అపాయం జరుగదు. ఈదెబ్బతో తన సుఖానికే అంతరాయం ఉండదు.

8

రాత్రి ఒంటి గంటయింది.

హరనాథ్ బట్టలన్నీ సర్దుకున్నాడు. అన్నయ్యను అడిగి ఇంపాలా కారు తాళాలు తీసుకున్నాడు. టాంక్ నింపాడు పెట్రోలుతో. తెల్లారాక తను మద్రాసుకి వెళ్ళిపోతున్నాడు.

గాడ్రెజ్ అల్మైరాతీసి అందులోవున్న డబ్బంతా తెచ్చి మంచంపైన వేసుకుని కూర్చున్నాడు. అన్నీ వందరూపాయల నోట్లే. మొత్తం యాభై కట్టలు. దీన్ని పదింతలు చెయ్యాలి. డబ్బంతాతీసి మళ్ళీ యథాస్థానంలో పెట్టాడు. అల్మైరా

మూస్తూండగా లైటారిపోయింది. కరెంటు పోయిందేమోననుకుంటూ వెలుపల లైట్లు వెలుగుతున్నాయేమో చూద్దామనుకుని కిటికీవద్దకు వెళ్ళాడు.

అక్కడా చీకటి కనుపించింది.

వీపుపైన చురుక్కుమంది. వెనక్కి తిరగబోయాడు. కానీ వెంట వెంటనే కత్తిపోట్లు తగిలాయి. ఏదో చెయ్యి వెనుకనుండి ముందుకొచ్చి నోరు నొక్కిపట్టింది. రెక్కలు తెగిన పక్షిలా గిలగిల కొట్టుకున్నాడు హరనాథ్. నిముషంలో నేల కొరిగింది అతని ఆకారం.

ఆగంతకుడు తన పని ముగించుకొని వెళ్ళిపోయాడు.

మళ్ళీ లైట్లు వెలిగాయి.

లైటు వెలుగులో, రక్తపు మడుగులో, తెల్లవారిందాకా హరనాథ్ శవం అలా గేపడిఉండిపోయింది. కాఫీటిఫిను తెచ్చిన నౌకరు తలుపులుతీసి ఉండడం చూశాడు.

లోనికెళ్ళి హరనాథ్ శవాన్ని చూసి నోరు వెళ్ళబెట్టి "బాబోయ్; హత్య!" అని పెద్దగా అరిచాడు.

హాల్లోవున్న జనమంతా మేడమీది గదిలోకొచ్చారు.

మురళి తమ్ముడి శవంప్రక్క నిలబడ్డాడు. అతని కళ్లు చెమ్మగిల్లాయి. అప్పుడే వచ్చిన ఇందిర జరిగిన ఘోరాన్ని చూసి "చిన్నన్నయ్యా!" అంటూ బావురుమని ఏడ్చింది.

అప్పుడే లోనికొచ్చిన సుందరం "ఏమిటీ ఘోరం?" అడిగాడు. ఎవరూ జవాబు చెప్పలేదు.

"నాన్నగారికి ఫోన్ చేసి చెప్పండి," అన్నాడు మురళి.

"చేస్తాను. నిన్న సాయంత్రం హరనాథ్‌కు డబ్బిచ్చాను. అది ఉందో లేదో చూడండి" అన్నాడు సుందరం.

మురళి, ఇందిర, సుజాత, చకచక సూట్‌కేస్‌లు, అల్మెరాలు, మొత్తం గాలించారు. ఎక్కడా డబ్బు కనిపించలేదు.

"ఎక్కడా లేదు?"

"అయితే ఆ డబ్బుకోసమే ఎవరో చిన్నబాబును హత్యచేసి వుంటారు. నేను పోలీసుల క్కూడా ఫోన్ చేస్తాను," అన్నాడు సుందరం.

"వద్దు! ముందు మామగార్ని రానివ్వండి. ఆ తర్వాత చూద్దాం," అంది సుజాత.

ఇందిర వదినకేసి చూసింది. సుజాత మాట్లాడకుండా చూస్తూ నిలుచుంది.

సుందరం హాల్లోకి వెళ్ళి వరహాలరాజు గారికి ఫోన్ చేశాడు.

మరో రెండునిముషాలకల్లా వరహాలరాజుగారు వస్తూనే "బాబూ! హరీ!" అంటూ శవం మీదపడి గుండెలు బాదుకుంటూ ఏడ్చాడు.

మురళి, ఇందిర, తండ్రిని చిన్నగా లేవదీసి ఓదార్చారు.

"పోలీసులకింకా ఫోన్ చెయ్యలేదండీ! మీ కోసం ఎదురు చూస్తూండి పోయాం!" అన్నాడు సుందరం.

"ఫోన్ చెయ్యండి, రమ్మని," అన్నాడు రాజుగారు.

"ఈ వయస్సులో నాకీ కడుపుకోత ఏమిటి? మీ అమ్మ పోయింది మొదలు మిమ్మల్ని కళ్ళల్లో పెట్టుకుని పెంచాను. హరి ఇలా నా ముందే అంతమవుతాడని నేనూహించలేదు," అంటూ మళ్ళీ కంట తడి పెట్టుకున్నారు రాజుగారు.

"పోలీసు లొస్తారుగా బాబూ! వాళ్లు హంతకుణ్ణి సులభంగా పట్టుకుంటారు. పైగా డబ్బుకూడా దొంగిలించాడాయె అవన్నీ బాంకునుండి తెచ్చిన కొత్త నోట్లు. వాటి నంబర్లన్నీ మన దగ్గరున్నాయి. మీరు ధైర్యంగా వుండండి. హరిని చంపిన దుర్మార్గుణ్ణి మాత్రం ఉరికంబ మెక్కించడం మాత్రం ఖాయం!" అన్నాడు సుందరం.

"నాన్న! పోలీసులెటూ వస్తారు. వాళ్ళపని వాళ్లు చేసుకు పోతారు. నాకు తెలిసిన ప్రఖ్యాత ప్రయివేట్ డిటెక్టివ్ గారున్నారు. వార్ని పిలిపిస్తే హంతకుణ్ణి సులభంగా పట్టు

కుంటారు. వారు మొన్న నాతో అమెరికా నుండి విమానంలో వచ్చారు!" అంది ఇందిర.

"ఆయన పేరేమిటి?" అడిగాడు మురళి.

"సుధాకర్."

"ఆయన్ని గురించి నేనూ విన్నాను. అలాగే పిలిపిద్దాం," అన్నాడు మురళి.

"పోలీసులు చెయ్యలేంది డిటెక్టివ్‌లు చెయ్యగలరా. అనవసరంగా డబ్బు దండుగ తప్ప," అంది సుజాత.

"ఆవిడగారి మాటా నిజమే!" అన్నాడు సుందరం.

"డబ్బు, డబ్బు, డబ్బు!!! తరగనంత ఉంది మనదగ్గర. దాని మొహం చూడని వాళ్ళ సలహాలు మా కక్కర లేదు. ఇప్పుడే ఫోన్ చేసి రమ్మంటాను," అంది ఇందిర తండ్రితో.

"అలాగేనమ్మా! నీ యిష్టం," అన్నాడు రాజుగారు.

ఇందిర దిగి క్రిందకు వెళ్ళిపోయింది. రాజుగారు చుట్టతీసి వెలిగించుకున్నారు. దూరంగా కారొచ్చి ఆగిన చప్పుడైంది.

"పోలీసులొచ్చారు!" అన్నాడు సుందరం.

రెండు నిముషాల్లో పోలీసు పటాలం గదిలో కొచ్చింది.

9

ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు రాజుగారి ముందు నిలబడ్డాడు. అతనికి ఆయనంటే గౌరవంతో బాటు భయంకూడా వుంది. కారణం వారి ఔదార్యంవల్లే డిగ్రీ తెచ్చుకో గలిగాడు.

"మీరు దిగులు పడకండి సార్! ఆ దురాగ్రుణి పట్టుకోనే పూచీ నాది" అన్నాడు ఈశ్వరరావు.

బదులు చెప్పకుండా మౌనంగా కూర్చున్నాడు రాజుగారు.

పోలీస్ డాక్టరొచ్చి "కత్తిపోట్లు బలంగా తగిలాయి. హంతకుడికి మంచి దేహదార్ఢ్యం వున్నట్టుంది. గాయం అంగుళం వెడల్పున, నాలుగంగుళాల లోతున వుంది. మరణం వెనువెంటనే సంభవించింది," అన్నాడు తన ప్రాథ

మిత్ర పరిశోధన ఫలితాన్ని తెలియజెపుతూ.

"పోస్ట్‌మార్టం చేశాక మా రిపోర్టు త్వరగా పంపండి!"

"అలాగే!"

అంతలోనే ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్ వచ్చి ఏ విధమైన వేలిముద్రలు దొరకలేదన్నట్లు పెదవి విరచాడు.

పోలీసులు హరిశవాన్ని పోస్ట్ మార్టంకోసం తరలించారు. ఆ గదిని సీలు చేశారు.

అందరూ వెళ్లిపోయారు. ఈశ్వరరావుకు జరిగిందంతా చెప్పాడు సుందరం. అతను క్రిందకువెళ్ళి నౌకర్లను, వంట పనివాడ్ని, తోటమాలిని రకరకాల ప్రశ్నలతో వేధించాడు. ఎవ్వరూ ఏమీ చెప్పలేకపోయారు.

ఆ మధ్యాహ్నానికి డిటెక్టివ్ సుధాకర్, అతని అసిస్టెంటు వసంత ఎస్టేటు చేరుకున్నారు.

"థాంక్యూ సార్! ఫోన్ చెయ్యగానే వచ్చారు" అంది ఇందిర ఎదురొచ్చి.

పరస్పర పరిచయాలు అయ్యాక ఇందిర, హరి హత్యను గురించి వివరంగా తనకు తెలిసినంతవరకు చకచక చెప్పుకు పోయింది. మాటలమధ్య వాళ్ళకు తెలీకుండానే మేడ మెట్లెక్కారు.

హరి గది చూపించింది. దానికి సీలువేసి వుండడంతో మళ్ళి క్రిందకు దిగి వచ్చారు.

వరహాలరాజుగారు, మురళి, సుజాత, సుందరం అంతా అక్కడే వున్నారు.

"ఇందిర ద్వారా హత్యకు సంబంధించిన వివరాలు కొన్ని తెలిశాయి. జరిగిందాన్ని బట్టి ఆలోచిస్తే ఇంకొన్ని హత్యలు జరిగే అవకాశం వున్నట్లు తోస్తూంది. నేను కొద్ది రోజులు నా అసిస్టెంటుతో సహా ఇక్కడే వుంటాను. ఎందుకైనా ఎవరి జాగ్రత్తలో వాళ్ళుండటం మంచిది. డబ్బుకోసమే

జరిగిన హత్యయితే హరనాథ్‌ను డబ్బుకోసం బెదరించి తీసుకొనిపోవాలి. వెనకగుండా వెళ్ళి కత్తితో పొడిచి చంపాల్సిన అవసరం నాకు కనుపించడం లేదు,'' అన్నాడు.

"జరిగింది చాలక ఇంకా కొన్ని హత్యలు జరుగుతాయంటారా?'' అడిగాడు రాజుగారు.

"అనే నా అభిప్రాయం. అయినా అలాంటిది జరగకుండా నా శాయశక్తులా ప్రయత్నిస్తాను,'' అన్నాడు సుధాకర్.

10

సుధాకర్ కిటికీ వారగా రాకింగ్ చెయిర్ వేసుకుని ముందుకూ వెనక్కూ ఊగుతూ సిగరెట్ కాలుస్తూ, ఆలోచించుకోసాగాడు.

ఇంతలో ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు వచ్చి తన్నుతాను పరిచయం చేసుకొన్నాడు.

తర్వాత "మీ పరిశోధన ఎంతదూరం వచ్చింది?'' అడిగాడు సుధాకర్.

"అందర్నీ ప్రశ్నించాను. ఎవ్వరూ మన కుపయోగించే చిన్న సమాచారం కూడా చెప్పలేకపోయారు,'' అన్నాడు.

"మెయిన్ డోర్ దగ్గరున్న వాళ్ళెవ్వరూ తమకు తెలిసీ లోపలి కెవ్వరూ వెళ్ళలేదన్నారు. అలాగే వెలుపలకు వెళ్ళలేదని అంటున్నారు. కిటికీలో గుండా ఎవ్వరూ హరనాథ్ గదిలోకి రాలేరని మనకు చూస్తేనే తెలుస్తూంది. అయితే హంతకు డెలా వచ్చాడు?''

"అదే సార్ నాకు అర్థంగానిది.''

"ఆ కాపలా వాళ్లు అబద్ధం చెప్తూనన్నా వుండాలి. లేదా హంతకుడు లోపలే వుండి వుండాలి,'' అన్నాడు సుధాకర్.

"కాపలా వాళ్ళను అడిగాను. వాళ్లు తమకు తెలీదంటున్నారు. రాజుగారుకూడా వాళ్లు చాలా నమ్మకస్తులనీ, వాళ్ళు చెప్పేది నమ్మవచ్చన్నారు!'' అన్నాడు ఈశ్వరరావు.

"అలాగైతే హంతకుడు లోపలే వుండాలి."

"అదెలా సాధ్యం."

"అసాధ్యమంటూ ఏదీ లేదు. హత్యజరిగిన రోజు రాత్రి బంగళాలో వున్న వ్యక్తుల లిస్టు మీదగ్గరుంటే ఇవ్వండి. వీలైతే రాత్రికి బంగళాచుట్టూ అక్కడక్కడా పోలీసుల్ని పెట్టండి. అనుమానం కలిగించే విధంగా ఎవరన్నా ప్రవర్తిస్తే పట్టుకొని సెషనులో పెట్టమనండి. మిగిలింది నేను చూసుకుంటాను," అన్నాడు సుధాకర్.

"మళ్ళీ మరో హత్య జరుగుతుందంటారా?" అడిగాడు ఈశ్వరరావు.

"హత్యమాటటుంచుదాం. హంతకుడు బంగళా లోపలి వ్యక్తేననుకున్నాం. రాత్రి అతను వెలుపలకు వెళ్ళలేదు. ఆ డబ్బుకూడా వెలుపలకు వెళ్ళలేదు. అటు మీరూ, ఇటు నేనూ హంతకుణ్ణి పట్టుకునేందుకు తయారయివున్నాం. ఇప్పుడు డబ్బు ఎవరివద్ద దొరికితే వాళ్ళే హంతకులని మనకు ఋజువవుతుంది. అందువల్ల కనీసం ఆ డబ్బునన్నా వెలుపలకు జేర్చే ప్రయత్నం జరుగుతుంది" అన్నాడు సుధాకర్.

"మీరు చెప్పినట్లే చేస్తాను. వస్తాను" అంటూ ఈశ్వరరావు వెళ్ళిపోయాడు.

అప్పుడే వసంత లోనికొచ్చింది.

"నువ్వేం సమాచారం సేకరించుకొచ్చావ్?" అడిగాడు.

"ఈ ఇంట్లో ఒక్క ఇందిరతప్ప మిగిలిన వాళ్ళంతా నన్నుచూస్తే పిశాచాన్ని చూచినట్లు భయపడి దూరంగా తప్పుకున్నారు. పలకరిస్తేకూడా పలక్కుండా వెళ్లి పోతున్నారు" అంది వసంత.

"ఇందిరేమంటుంది?"

"చనిపోయిన హరికాస్తదురుసుగా వ్యవహరిస్తాడేతప్ప, మనస్సు చాలా మెత్తనిదట. అతని కెవ్వరూ విరోధులు

లేరంటుంది. వరహాలరాజుగారు వుంచుకున్న మణిమాలంటే అతనికి గిట్టదట. అతనేదో బిజినెస్ చేసుకుందామని డబ్బు డిగితే రాజుగారు ఇవ్వనన్నారట. తండ్రి అలా అనడానికి ఆమే కారణమనుకుని వెళ్లి, మణిమాలను నాలుగు దులిపి వచ్చాడట" అంది వసంత.

"రాత్రి ఆమెపైన హత్యా ప్రయత్నం జరిగిందని కదూ వాళ్ళు చెప్పింది."

"అవును. అది హరి చేయించివుంటాడని, ఒకవేళ మణిమాల ఎవరినన్నా హరిని హత్య చేయించేందుకు పురమాయించిందేమో!"

"వెలుపలి వాళ్ళెవరు లోనికి వచ్చేందుకు వీలులేదని ఈశ్వరరావు అంటున్నాడు."

"లోపల వాళ్ళనే ఆమె లోగొట్టుకుందేమో?"

11

ఆ రాత్రి అంతా కలిసి భోం చేశారు.

వరహాలరాజుగారు కూడా ఇంట్లోనే వుండిపోవటం, మురళికి, సుందరానికి, ఇందిరకు ఆశ్చర్యం వేసింది.

ఒక్కొక్కరే టేబిల్ వద్దనుండి లేచిపోసాగారు. సుందరం మెల్లగా భోజనం చేస్తున్నాడు. ఆఖరకు అతనొక్కడే మిగిలాడు. గదిలోంచి వెళ్ళిపోయిన ఇందిర తిరిగి లోనికొచ్చింది.

"తలుపులు తీసివుంచుతాను, ఎవ్వరి కంటబడకుండా రా?" అంది సుందరాన్ని. అలాగే నన్నట్లు తలూపాడు.

సుధాకర్, వసంత ఒక్కొక్క గదే వచ్చి చూశారు. కిటికీలన్నీ తామే స్వయంగా బిగించి, తలుపులు లోపల్నుంచి వేసుకోమని ప్రతి ఒక్కరికీ చెప్పారు. అన్ని గదులు పరిశీలించడం అయినాక వచ్చి తమకు ఏర్పాటు చేసిన గదిలో కూర్చున్నారు.

"బహుశా ఈ రాత్రికేమీ జరగకపోవచ్చు," అంది వసంత.

"మన విషయం వాళ్ళకు తెలుసుగా, అందుకని వాళ్ళ జాగ్రత్తలో వాళ్ళుంటారు" అన్నాడు సుధాకర్.

పనివాడొచ్చి తలుపు తట్టాడు. వసంత వెళ్ళి తలుపుతీసింది.

"పాలమ్మా!" అంటూ ఫ్లాస్కు అందించాడు.

వసంత దాన్నందుకుని తలుపులు మూసి వచ్చి కూర్చుంది.

"ఆ మణిమాలను చూసొచ్చావు కదా! ఆమె వద్ద ఏమైనా సమాచారం తెలిసిందా?"

"ఆవిడను నేను మద్రాసులో ఒకటి రెండుసార్లు చూశాను. డాన్సు ప్రోగ్రాములిస్తూండేది. దాంతోపాటు సినిమాలలో చిన్న చిన్న వేషాలు వేస్తూండేది. వరహాల రాజుగార్ని ఎలా వల్లో వేసుకుందో అర్థంగావడం లేదు."

"ఈ ఎస్టేటు మానేజరుగా వున్న సుందరంతో ఆమెకేమైనా సంబంధం వుందేమో మనం తెలుసుకోవాలి. రేపు అతని ఫొటో ఒకటి సంపాదించు. పోలీస్ కమీషనరుగారికి పంపుదాం. ఆమే హరిని హత్య చేయించిందనుకోవడానికి ఆధారం లేకుండా వుంది. వరహాలరాజుగారు ఆమెను ఆంటి పెట్టుకునే వున్నారట. హత్య చేసేందుకు ఆమెకు కారణం వుంది కానీ అవకాశం లేదు" అన్నాడు సుధాకర్.

"అవును బాస్! నాకూ అలాగే తోచింది."

"మన రాకపట్ల ఏదైనా ఇబ్బంది పడుతున్నట్లుతోచిందా నీకామె మాటల్లో."

"అలాంటిదేమీ లేదు అసలే నటి. కాస్త అందంగా కన్నీళ్ళు పెట్టుకుంది అంతే!" అంది వసంత.

సుధాకర్ వాచీ చూశాడు. గంట పదకొండయింది.

క్రైమ్ జర్నలు అందుకుని చదువుతోసాగాడు.

వసంత నడవలో కొచ్చింది. లైట్లన్నీ ఆరిపోయాయి. ఎక్కడా ఏ విధమైన అలికిడీ లేదు.

ఓ మారు అన్ని గదులవంకా చూసింది. తనున్న వరుసలో మూడు గదులున్నాయి. ప్రక్కనున్న గదిలో ఇందిరుంది. దానవతల మురళి వున్నాడు. ఎదురుగానున్న వరుస గదుల్లో రాజుగారు, సుందరం వున్నారు. మూడో గదిఖాళీ.

12

ఇందిర చీకట్లో మంచంపైన పడుకుని చెవులు రిక్కించి వినసాగింది. ఆవేశం అపుకోలేక సుందరాన్ని రమ్మన్నదే గానీ, పరాయిమనుషులు ఇంట్లో ఉన్నప్పుడు అతను రావడం ప్రమాదమన్నది ఆమెకు ఆలస్యంగా అర్థమైంది.

తలుపులు తెరచి పెట్టకుండా లోనుంచి బిగించి వేస్తే, వచ్చి చూసుకుని తిరిగి వెళ్ళిపోతాడు. అలా చేద్దామని తోచింది. అతను రావడం తలుపులు తట్టడం, తన గది ముందు వెయిట్ చెయ్యడం, ప్రమాదమనుకుంది.

తలుపుల దగ్గర అలికిడయింది.

ఇందిర లేచి కూచుంది చీకట్లో. నల్లటి సూటులోవున్న ఆకారం లోనికొచ్చి తలుపులు బిగించింది. ఆవేశం అపుకోలేక నగ్నంగానే వున్న ఇందిర మంచం దిగి, ప్రియుడి కెదురెళ్ళి ఒక్క వుదుటున అతన్ని కౌగలించుకుంది గట్టిగా.

మరుక్షణంలో కుప్పలా నేల కూలిపోయింది ఇందిర, కడుపు చేతపట్టుకొని.

అంతలో ఎవరో తలుపులు తట్టారు.

అతను మెల్లగా తలుపులు తీసి, తలుపు వారగా నక్కాడు. వెలుపలి వ్యక్తి లోనికి రాగానే, ఆగంతకుడు వెలుపలకు తప్పుకున్నాడు. లోనికొచ్చిన వ్యక్తి కాళ్ళకేదో మెత్తగా తగిలింది. చీకట్లోనే కళ్ళు చిట్లించి చూశాడు.

వెంటనే స్విచ్ నొక్కాడు. లైటు వెలిగింది. ఇందిర

పొత్తికడుపు దగ్గర దూసుకుపోయిన తుపాకిగుండు చేసిన గాయంలోంచి రక్తం వరదలుగా కట్టుకొని ప్రవహిస్తూంది.

"బాస్! ఏమైంది?" అడిగింది వెనుకనుండి వసంత.

"ఇందిర నెవరో హత్యచేశారు."

"నువ్విక్కడే వుండు వస్తాను" అంటూ సుధాకర్ గబగబ వెలుపలకు వెళ్ళిపోయాడు. అందరి గదులూ తట్టి నిద్రలేపాడు. రాజుగారు తట్టగానే తలుపు తెరచారు. మురళి రెండు నిముషాలకుగాని వచ్చి తలుపు తీయలేదు. అతను నిద్రపోయినట్లు కనుపించలేదు సుధాకర్‌కి.

సుందరం ఐదునిముషాలు తడితేగాని నిద్ర లేచిరాలేదు. అందరికీ జరిగిన ఘోరం వివరించాడు సుధాకర్. ఒక్కరికీ నోటిమాట రాలేదు. అంతా ఇందిర గదిలోకివచ్చారు. తలుపుల కున్న గడియల్ని తాకొద్దని అందరికీ హెచ్చరించాడు. వసంతను పోలీసులకు ఫోన్ చెయ్యమన్నాడు సుధాకర్.

చిన్నపిల్లాడిలా వెక్కిళ్లుపెట్టి ఏడవసాగారు రాజుగారు.

"ఈ యింటకేదో శనిపట్టింది. దీన్నెలాగైనా వదలగొట్టాలి. సుధాకర్‌గారూ మీరే ఈ పనికి పూనుకోవాలి," అన్నాడు సుందరం.

"హత్య జరుగుతుందని అనుమానించాను. కానీ ఇంత తెలివిగా, నన్ను దెబ్బతీయగలడని ఊహించలేకపోయాను. మీరు కాస్త ధైర్యంగా వుండండి," అన్నాడు సుధాకర్.

మణిమాల లోనికొచ్చింది. ఆమెరాక గదిలోకి క్రొత్త వెలుతురు తెచ్చినట్లయింది.

"మణీ! అమ్మాయిని దారుణంగా ఎవరో హత్యచేశారు. నా సంతానాన్ని సమూలంగా నాశనం చేసేందుకెవరో కక్ష గట్టారు" అంటూ ఆమె వొళ్ళో తలబెట్టుకొని బావురుమన్నారు. మణి కూడా రాజుగార్ని ఓదార్చసాగింది.

ఈశ్వరరావు మళ్లీ పటాలంతో లోనికొచ్చాడు.

జరగవలసిన తతంగమంతా యథావిధిగా జరిగిపోయింది. హత్య కుపయోగించిన రివాల్వరు దొరకలేదు. తలుపులకున్న గడియలపైన, మరెక్కడగానీ హంతకుడి వ్రేలిముద్రలు లేవు.

13

"రాత్రి పాల ఫ్లాస్కు తెచ్చిచ్చింది నువ్వేగదూ!" అడిగాడు సుధాకర్ ఎదురుగావున్న నలభై సంవత్సరాల కోటయ్యను.

"అవును దొరా!"

"మాకు మాత్రమే ఇచ్చావా? లేక అందరికీ ఇచ్చావా?"

"అందరికీ ఇచ్చాను సార్!"

"ఫ్లాస్కులన్నీ ఒకేమారు తెచ్చావా?"

"లేదు సార్ ముందు మిగిలిన వాళ్ళకు తెచ్చియిచ్చాను. ఆ తర్వాత వెళ్ళి మీకు తెచ్చాను."

"అలా ఎందుకు చేశావ్? అన్నీ ఒక్కమారు ఎందుకు తేలేదు."

"వంటమనిషి మామూలులాగే ముందు మూడు ఫ్లాస్కుల్లో నింపి ఇచ్చింది. అయ్యగారు ఇక్కడే వున్నారని చెప్పాను. మరో ఫ్లాస్కులో మిగిలినవి పోసింది. తర్వాత మీ గురించి చెప్పాను' కాచిన పాలయిపోయినాయని, మళ్ళీ కాస్తానని, ఈ లోపల వెళ్ళి మిగిలినవాళ్ళకిచ్చి రమ్మని చెప్పింది."

"అప్పుడెవరన్నా అక్కడున్నారా?"

"లేదు దొరా! అదీ నేనూ మాత్రమే వున్నాం."

"మళ్ళీ నువ్వు తిరిగి వెళ్ళేసరికి వంట మనిషక్కడే వుందా ఇంకెవరయినా వున్నారా?"

"నేను మేడమీద కెళ్ళబోయే ముందు సుజాతమ్మగారు వంటగది గుమ్మంలో ఎదురొచ్చారు. మళ్ళీ నేను తిరిగొచ్చే సరికి ఆమె కనిపించలేదు."

"నువ్వెళ్లు" అంటూ దూరంగా నిలుచున్న కాంతమ్మను

పిలిచాడు. "వంట పని నువ్వేనా చేసేది?"

"అవును బాబూ!"

"కోటయ్య చెప్పిందంతా నిజమేనా?"

"నిజమే బాబూ!"

"సుజాతమ్మ గదిలోకి ఎందుకొచ్చింది."

"మురళయ్యగారికి కడుపు నొప్పిగా ఉందని కాస్త వాము గావాలంది. ప్రక్కనున్న స్టోర్ రూంలోకి వెళ్ళి తెచ్చిచ్చాను. తీసుకొని అమ్మగారు వెళ్ళిపోయింది."

"వంట మనిషి చెప్పేది నిజమేనాండీ!" అడిగాడు అక్కడున్న సుజాతను. "అవునండీ!" అంది సుజాత.

"మిస్టర్ మురళీ! కడుపు నొప్పి వెంటనే తగ్గిపోయిందా? లేక చాలాసేపు దాంతో బాధపడ్డారా?"

"పెద్దనొప్పి పుట్టలేదండీ! కొద్దిగా ఉండింది. కాస్త వాము తిని నీళ్లు త్రాగాను. నిద్రపట్టింది. అంతే!" అన్నాడు.

"కనీసం మీకా నొప్పి ఎక్కువగా ఉండివున్నా మేలుకొని ఉండి ఉండేవాళ్లు. హంతకుడి అడుగుల చప్పుడు వినబడేది. ఈ దారుణం జరగకపోయేది," అన్నాడు సుధాకర్.

"నిజమేనండీ! కానీ మీరు మేల్కొని ఉంటారనుకున్నాను," అన్నాడు మురళి.

"మేము త్రాగిన పాలల్లో మత్తుమందు కలిపారు. త్రాగాక మైకం కమ్మింది. నేనూ, వసంత వెంటనే పడిపోయాం. ఆ పాలల్లో మత్తుమందు కలిపిందెవరో తెలుసుకుందామనే అందర్నీ ఇన్ని ప్రశ్నలు వేశాను."

"పాలల్లో మత్తుమందు కలిపారా? మేమూ త్రాగాం. మా కలాంటి అనుభవం కాలేదే?" అన్నాడు సుందరం.

"మాకు పంపిన పాలల్లో మాత్రమే మత్తుమందు కలిపినట్లుంది. హంతకుణ్ణి పట్టుకునేందుకు వచ్చిన వాళ్ళం గాబట్టి మేము మేలుకొనే వుంటామని అతనికి తెలుసు. అలా జరిగితే

ఈ హత్యచేసే అవకాశం లభించదు. అందుకే మా కళ్ళు మూయించాడు" అన్నాడు సుధాకర్.

"ఈ హత్యలిలా ఎందుకు చేస్తున్నారో, వీటివల్ల ఎవరికి ఏం లాభిస్తుందో చెప్పగలరా??" అడిగాడు రాజుగార్ని.

"నా ఆస్తికి ఇంకా వీలునామా రాయలేదు. నా తదనంతరం ఈ ఆస్తి నేనెవరికి రాస్తే వాళ్ళకే దక్కుతుంది. ఇది నా స్వార్జితంగాకున్నా మా సాంప్రదాయ మది."

14

వసంత ప్రొద్దున్నే మద్రాసు వెళ్ళిపోయింది.

డైనింగ్ టేబుల్ వద్ద ఎదురయిన సుధాకర్‌ను మురళి అడిగాడు వసంత గురించి. మద్రాసు వెళ్ళిందని చెప్పాడు. అంతలోనే సుందరం వచ్చాడు.

అందరూ టిఫిన్ తినడం ప్రారంభించారు.

"ఇక్కడుండాలంటే భయంగా ఉంది. ఈ ఉద్యోగం మానుకుని వెళ్ళిపోదామనిపిస్తూంది," అన్నాడు సుందరం.

"ఇంత జరిగాక మనం అజాగ్రత్తగా ఉండంగా? హంతకుణ్ణి పట్టుకునే అవకాశం మీకు కలగవచ్చు. ఈశ్వరరావు కూడా మీరు ఎస్టేటు వదలి పోయేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో అనుమతించడనుకుంటాను," అన్నాడు సుధాకర్.

సుందరం మౌనంగా ఉండిపోయాడు.

వరహాలరాజుగారు గదిలోకొచ్చారు. అందరూ ఆయనకు నమస్కరించారు. అక్కడున్న టిఫిన్ తినకుండా కాఫీ మాత్రం త్రాగసాగారు. మురళి, సుందరం లేచి వెళ్ళిపోయారు. సుధాకర్ మాత్రం కూర్చున్నాడు.

"రాజుగారూ! నా ప్రశ్నలకు కొన్నిటికి మీరు సమాధానం చెప్పాలి' వాటిన్నిబట్టి నేను ఎలా పరిశోధన సాగించాలో ఆలోచించుకుంటాను," అన్నాడు.

"అడగండి చెప్తాను."

"మణిమాలను మీరు ఎలా కలుసుకున్నారు?"

"మద్రాసు మ్యూజియం చూసేందుకు వెళ్ళాను. అక్కడ ఆమె, సుందరం కనుపించారు. ఆమె అందం నన్ను పిచ్చెక్కించింది. ఆ రోజంతా నేను ఆమెవెంటే తిరిగాను. నా అవస్త కనిపెట్టిన సుందరం, తన్ను తనే పరిచయం చేసుకున్నాడు. ఆమె పేరు మణిమాలనీ, ఎవరో రాజుగారు ఉంచుకొని ఉన్నారనీ, వారిదగ్గర తను సెక్రెటరీగా పని చేస్తున్నాననీ చెప్పాడు.

ఆమెపై నాకు కోరికగా ఉందన్నాను. నా వివరాలు అడిగాడు. చెప్పాను. ఆమె నెలాగైనా ఒప్పిస్తానన్నాడు.

మరుసటి దినం సాయంత్రం మణిమాల హోటల్‌కు వచ్చింది. తన్నుంచుకొన్న రాజా పేరుకు మాత్రమే రాజా గారనీ, వారిదగ్గర డబ్బులేదనీ, అతన్ని వదలి వేద్దామని అనుకుంటున్నాననీ, నాకు అభ్యంతరం లేని పక్షంలో, తను వెంట వస్తాననీ అంది. అంతే. వెంట తీసుకొచ్చేశాను," ఆగాడు రాజుగారు.

"మణి వచ్చిన రెండు మాసాలకు సుందరం వచ్చాడు. మణిని కలుసుకున్నాడు. ఆ రాజా అతన్ని ఉద్యోగంలోంచి తీసివేశాడనీ, బ్రతకటం కష్టంగావుందనీ, ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించమనీ అడిగాడట. ఆమె ఆవిషయం నాకు చెప్పింది. వెంటనే నేను అతనికి ఎస్టేట్ మానేజర్ ఉద్యోగం యిచ్చాను."

"డబ్బు లావాదేవీలు ఎవరు చూస్తుంటారు?"

"మా పెద్దబ్బాయి.అయినా అన్ని కాగితాలపైన నాసంతకాలు వుండవలసిందే. నాకు చెప్పంది వాదేమీ చెయ్యడు."

"మీకు మొత్తం ఎంత ఆస్తి ఉంటుంది."

"పదికోట్లకుపైనే వుంటుంది. సరిగ్గా తెలీదు."

"సుందరం డబ్బు కాజెయ్యడంలాంటి దేదైనా మీరు

గమనించారా?"

"లేదండీ! అతనటువంటివాడుకాడు."

"మణిమాలకు ఆ స్తేమన్నా మీరు వ్రాసిచ్చారా?"

"లేదండీ! ఆ యిల్లు ఆమె పేరకొన్నాం. కారు కొని చ్చాను. అదిగాక నగలుంటాయి. అంతే."

"ఎందుకైనా మీరు తగిన జాగ్రత్తలో వుండటం మంచిది. మురళినీ, సుందరాన్ని కూడా హెచ్చరించాను" అన్నాడు.

"అలాగే!" అంటూ లేచారు రాజుగారు.

"మీ అమ్మాయి అమెరికానుండి వచ్చాక ఆమె పెళ్ళి విషయం మీరేమైనా సుందరంతో చర్చించారా?" అడిగాడు సుధాకర్.

"లేదండీ! ఏదైనా మంచిసంబంధం చూడాలనుకుంటున్నాననే చెప్పాను. అంతే!"

"అప్పుడు సుందరం ప్రవర్తన ఎలా వుండింది?"

"నాకేం విచిత్రంగా తోచలేదు. తనకు తెలిసినవిరెండుమూడు గొప్పసంబంధాలున్నాయనీ, వాట్నిగూడా విచారిద్దామన్నాడు. మీ అభిప్రాయం నాకు బోధపడడంలేదు?"

"ఊరకే అడిగాను. సుందరంతో మీ అమ్మాయి కలుపుగోలుగా వుండేదా?"

"ఏమోనండీ! అదివచ్చి మూడ్రోజులే అయింది. నేను ఇక్కడ వుండటం లేదాయె. ఇంతలో ఈ దారుణం జరిగింది. నాకుమాత్రం ఏంతెలుస్తుంది," అన్నాడు రాజుగారు.

"మీరు రాత్రికి ఇక్కడుంటారా? మణిమాలగారింటికెళ్తారా?" అడిగాడు సుధాకర్.

"అక్కడికే వెళ్తాను. కాస్త మనస్సన్నా ప్రశాంతంగా వుంటుంది."

"జాగ్రత్తగా వుండటంమాత్రం మరచిపోవద్దు," మరోసారి హెచ్చరించాడు సుధాకర్.

రాజుగారు వెళ్లిపోయారు. సుధాకర్ తనగదికి వెళ్లిపోయాడు. డ్రస్ మార్చుకుని వెలుపలకొచ్చి కారెక్కి పోలీస్ స్టేషనుకేసి పోనిచ్చాడు.

15

మధ్యాహ్నం మూడుగంటలయింది. ఇంట్లో ఎవ్వరూ లేకుండా జాగ్రత్తపడ్డాడు సుధాకర్. మురళిని వాళ్ళ నాన్న రమ్మన్నాడని చెప్పి మణియింటికి పంపాడు. సుందరాన్ని రమ్మని ఈశ్వరరావుచేత ఫోన్ చేయించాడు. వసంత సుజాతను వెంటబెట్టుకొని ఎస్టేటు చూసేందుకు వెళ్లింది.

మెల్లగా వెళ్లి ముందు సుందరంగది తలుపులు తాళం తెరిచాడు. లోనికెళ్ళాడు. గది సాదాగావుంది. బెడ్ ప్రక్కన పేపర్లు పుస్తకాలు చిందరవందరగా పడున్నాయి.

అల్మైరా సొరుగులన్నీ లాగిచూశాడు. అక్కడేమీ కనుపించలేదు. వెతకవలసిన చోట్లన్నీ పూర్తయినాయి. తనకు కావలసినదేదీ దొరకలేదు. ఆఖరి చాన్సుగా మంచంపైనున్న బెడ్ తొలగించాడు. అతనికళ్లు పెద్దకమ్మాయి.

వందరూపాయల నోట్లకట్టలు వరుసగా పేర్చివున్నాయి. వాటిపైన బెడ్ వేసి, బెడ్ పైన దుప్పటి పరచుకోవడంలో ఎవ్వరూ అక్కడ డబ్బుందని ఊహించడంకష్టం. సుధాకర్ దాన్ని అక్కడే వుంచాడు. తలగడ తీసుకొని దాన్ని చేతుల్తో అదిమిచూశాడు. అక్కడేమీ కనిపించలేదు. అతను వెతుకుతున్నది ఇందిరను హత్యచేసేందుకుపయోగించినపిస్టల్.

సుందరం గదితలుపులు యథాతథంగా మూశాడు. మళ్ళీ తాళంనొక్కి, తిన్నగా మురళి గదికేసి వెళ్ళాడు. పదినిముషాలు శ్రమించి తలుపులు తెరవగలిగాడు.

ఇంద్రభవనంలాగుంది గది. గది మధ్యగా గుండ్రని ఎత్తైన బెడ్ వుంది. అది అవసరమైతే గుండ్రంగా తిరిగే ఏర్పాటువుంది. కిటికీలకు ఖరీదైన తెరలు వ్రేలాడుతున్నాయి.

గది ఏర్‌కండిషను చేసివుంది.

సుందరం గదిలోలాగే, మురళిగదిగూడా శోధించాడు సుధాకర్. అనుమానించదగిన వస్తువేది అతని కళ్ళ బడ లేదు. డ్రస్సింగ్ టేబుల్ పైన వందరూపాయల నోట్లకట్టలున్నాయి. ప్రక్కనున్న సొరుగులు లాగాడు. క్రిందిసొరుగులో పెద్ద డైరీలాంటి పుస్తకం కనుపించింది. దాన్నిలాగాడు.

అక్కడ నిలబడి చదవడం సాధ్యంకాదని మెల్లగా దాన్ని కోటుజేబులో వేసుకుని వెలుపలకొచ్చి తలుపులు మళ్ళి యధాప్రకారం బిగించి, మేడపైనుండి క్రిందికిదిగాడు.

క్రింద సుజాత గదివుంది. ఆమె, ఇద్దరు పిల్లలు క్రిందే వుంటారు. అవసరమైనప్పుడు భర్త రమ్మంటే పైకి వెళుతుంది.

సుజాత గదంతా వెతికాడు. అక్కడేమీ కనుపించలేదు. కానీ మంచం వెనుకవేపున్న ఆల్మైరాలో చీరలక్రింద దాచివుంచిన ఫోటో అల్బమ్‌మీద దృష్టి నాకర్షించింది. దాన్ని తెరిచాడు. అందులోని ఫోటోలుచూసి ఆశ్చర్యపోయాడు.

అన్నీ సుజాతవే. ప్రతిదీ గుడ్డలులేకుండా, నగ్నంగా తీయించుకున్నదే! ఒక గొప్పింటి స్త్రీ అలా బట్టలువిప్పి ఫోటోలు ఎలా తీయించుకోగలిగిందో అతని వూహకు అంద లేదు. దాన్ని చంకన పెట్టుకొని వెలుపలకొచ్చి తలుపుల్ని యధాతథంగామూసి మేడపైకి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

16

"నువ్వా సుధాకర్‌గార్ని పెళ్ళిచేసుకుంటావా?" రోజ్ గార్డెన్‌లో అడుగుపెడుతూ అడిగింది సుజాత వసంతను.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? అందంగావున్నాడు. ఐశ్వర్యముంది. కావలసినంత పేరుంది. పెళ్ళాడు సుఖపడతావ్," అంది.

"ఆ ప్రసంగం మామధ్య ఎప్పుడూ రాలేదు. ఆయన యజమాని, నేను ఉద్యోగిని."

"పెళ్ళాడనంటేపోయ్. కనీసం ఆయన దగ్గర అనుభవం రుచి చూడకపోయావా? ఆయన్ను నువ్వు రుచిమరగినా, నిన్నాయన రుచిమరిగినా పెళ్ళి ఈజీగా అవుతుంది," అంది సుజాత.

"నా కలాంటి పనులంటే గిట్టవు" అంది వసంత కాస్త కోపంగా. సుజాత మాటలతీరు వసంతకేమీ నచ్చలేదు. అయినా ఆమె మాటలు వినకతప్పలేదు. "మీ వారు రసికులా!"

"ఆఁ! నీరసికులు. అయినా నాకేం అసంతృప్తిలేదు. తీరని వంటూకోర్కెలను అణచిపెట్టను. ఎలాగోలా తీర్చుకుంటాను. అయితే అందుకు తెలివితేటలు కావాలనుకో. వాటికి నా దగ్గర కొదువలేదు," అంది సుజాత.

"మణిమాలను చూశారా మీరు?"

"ఆఁ! అదిక్కడకు రావడం, మా మామగార్ని వల్లో వేసుకోడం నాకు ఇష్టంలేదు. దాని దగ్గరేమీ లేదు. ఎర్రటి తోలుంది. నువ్వు చూశావా? మగాళ్ళకేమి కనుపిస్తుందో కానీ, ఏ ఆంగిల్ లో చూచినా దాని శరీరంలో నాకు సెక్స్ కనుపించలేదు."

"ఇంది రెటువంటిది?"

"ఇక్కడుండగా మగాళ్ళంటే వాడలి చచ్చేది. అమెరికాలో అంతా నేర్చుకొచ్చినట్లుంది. మద్రాసునుండి ఇక్కడికొచ్చేలోపుల సుందరాన్ని లోగొట్టుకొంది."

"సుందరం అలాంటి వాడు కాదన్నారు అందరూ?"

"ఈ మగాళ్లు వెలుపలకు కనపడేంత పవిత్రులేం కాదు."

"వారి ఎలాంటివాడు."

"అతనా! రసిక చక్రవర్తి. మా ఎస్టేటులో ఎదిగొచ్చిన ఏ ఆడపిల్ల నడిగినా చెపుతుంది ఆయన ప్రతాపం." నేను మాత్యల విషయంలో ఏమీ అనను. ఆడమగల సంగతులు నాకు ఇంటరెస్ట్. ఆవేవైనా అడుగు" అంది సుజాత.

"అవి నాకవసరం లేదు. ఇక ఇంటికి వెళ్దాం," అంది.

17

సుధాకర్ స్టోర్‌రూం తలుపులు తెరిచాడు. దాదాపు వంద డబ్బాలున్నాయి. ఒక్కొక్కటి మూతతీసి, చెయ్యి లోపలబెట్టి కలియబెట్ట సాగాడు. కానీ తనకు కావలసిన వస్తువు అక్కడ కనుపించడంలేదు.

"ఏమిటండీ! వెతుకుతున్నారు. ఏం కావాలి?" అడిగింది సుజాత గుమ్మం ముందు నిలబడి.

"అప్పుడే వచ్చేశారా? వసంతేది?" విస్తుపోతూ అడిగారు సుధాకర్.

"గదికి వెళ్ళింది. నన్ను రమ్మంటే వస్తాను."

"అఖ్ఖర్లేదండీ!అయినా నాక్కావలసింది మీకేం తెలుసు?"

"తెలీదనుకోండి! ఫలానిదని చెప్పండి. నేనూ వెతుకుతాను" అంటూ లోనికొచ్చి, తలుపులు గొళ్ళెం పెట్టింది.

సుధాకర్ ఆమె చేష్టలు క్రీగంట గమనిస్తూండిపోయాడు.

సుజాత ఉత్సాహంగా సుధాకర్ దగ్గరకు వెళ్ళింది.

"డబ్బాల్లో లేదు. ఒకవేళ మీ దగ్గరుందేమోనన్న అనుమానం వుంది. చూడమంటారా?" నవ్వుతూ అడిగాడు.

"నిరభ్యంతరంగా" అంటూ పైటకొంగు తొలగించింది సుజాత. మదించిన ఆమె యవ్వనం మంచు కప్పిన కొండ శిఖరాల్లా, గుండ్రంగా శంఖువుల్లా తీర్చి దిద్దినట్లుంది.

"ఇక్కడకాదు. రాత్రికి నా గదికి రండి. అక్కడ చెక్ చేస్తాను," అన్నాడు సుధాకర్ మరో డబ్బా మూత తీస్తూ.

ఇంతలో "సుజాత! సుజాత!" పిలుపులు వినిపించాయి.

"మా వారు! చూస్తే చంపేస్తారు మీరు వెళ్ళండి. నేను మెల్లగా వస్తాను," అంది సుజాత.

అంటూ డబ్బాలు దొర్లించింది. అవి క్రిందపడి దబదబ శబ్దమైంది. మురళి గది దగ్గరకొచ్చి తలుపు తెరిచి "ఏం చేస్తున్నావ్?" అడిగాడు.

"వీరు నన్ను బలవంతంగా లాక్కొచ్చి..." అంటూ పెద్దగా ఏడ్చింది.

మురళి కళ్ళు కోపంతో చింత నిప్పుల్లా మారాయి. నౌఖర్ల చేత సుధాకర్‌ను వెడరెక్కలు విరిచి కట్టించాడు.

18

అప్పుడే లోనికొచ్చిన రాజాగారు, ఆ దృశ్యాన్ని చూసి బెంబేలు పడ్డారు. నౌఖర్లను దూరంగా వెళ్ళమని కేకేసి, తనే వెళ్ళి సుధాకర్ కట్లు విప్పాడు.

"మురళీ నువ్వెళ్ళు" అన్నాడు రాజాగారు పరిస్థితి అర్థం చేసుకొని.

మురళి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

"సుజాత శాస్త పిచ్చిది. దాని మాటలు విని వీడు రెచ్చిపోయాడు. మీరు మరోలా అపార్థం చేసుకోకండి," అన్నాడు రాజాగారు.

"నాకెవరో ఇందిర హత్య జరిగిన రాత్రి పాలల్లో మత్తు మందు కలిపి పంపారు. ఆ మందు స్టోర్ రూంలో ఎక్కడో దాచి వుంటారని అనుమాన మేసింది. నేను దానికోసం వెళ్ళాను. ఈ లోపల ఈ గొడవ జరిగింది. హంతకుడా మందు పాట్లాన్ని తీసుకుని వుంటాడు," అన్నాడు సుధాకర్.

19

ఈశ్వరరావు వచ్చాడు. జరిగిందంతా చెప్పాడు సుధాకర్. విని విస్తుపోయాడు.

"ఇంతకూ మీ దృష్టిలో హంతకుడెవరనుకుంటున్నారు," అడిగాడు ఈశ్వరరావు.

"వసంత మద్రాసులో సుందరానికి సంబంధించిన కొన్ని వివరాలు తెలుసుకొచ్చింది. మణిమాల మామూలు ప్రాస్టిట్యూట్ గా వుండేది. సుందరం ఆమెకు బ్రోకరుగా పని చేస్తూండే వాడు. వరహాలరాజు పై తమ వల విసిరారు. సుజాత సుందరం కలసి చదువుకొన్నారు. ఆ రోజుల్లో వాళ్ళిద్దరికీ

సంబంధం వుండేది. ఆమెకు పెళ్ళయిన తర్వాతగూడా సుందరం, ఆమె కలుసుకుండే వాళ్ళు. ఆమె ద్వారానే రాజుగారి విషయాలు అతనికి తెలిశాయి.''

"ఈ విషయం మీకెలా తెలిసింది?''

"నిన్న మురళి డైరీ చిక్కింది. అందులో అన్నీ వివరంగా రాసుకున్నాడు. అన్నింటికన్నా విచిత్రమైన విషయం మురళికి మగతనం లేదు. పెళ్ళయింది మొదలు వరహాలరాజుగారే కోడల్ని యథేచ్ఛగా అనుభవిస్తూ వచ్చారు. ఈ మధ్య హరిగూడా ఆమె గదిలోకి వెళ్తున్నట్లు అనుమానంగా వున్నట్లు రాసుకున్నాడు. అందులో భార్యమీదికన్న తన అసమరత అలుసుగా తీసుకుని తన భార్యను అనుభవిస్తున్న తండ్రిపైన, తమ్ముడిపైన విపరీతమైన పగ రేగుతున్నట్లు చూచాయగా రాసుకున్నాడు,'' అన్నాడు సుధాకర్.

"అయితే ఈ హత్యలన్నీ మురళి చేసివుండాలి.''

"చెప్పలేం! నిన్న సుందరం గది పరిశోధించాను. అతని బెడ్ క్రింద ఐదు లక్షల రూపాయలున్నాయి. అది హరికిచ్చిన డబ్బు. ఆ డబ్బు అతని గదిలోకి ఎలా వచ్చింది. అతనే హరిని చంపివుండవచ్చు.''

రాత్రికి చెయ్యవలసిన కట్టుదిట్టాలను గురించి ఈశ్వరరావుకు కొన్ని సూచనలిచ్చాడు సుధాకర్.

ఎనిమిదింటికల్లా అందరూ భోజనాలుచేసి ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

20

గంట పన్నెండయింది.

సుధాకర్ మంచంపైన దుప్పటి కప్పుకొని పడుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు తప్ప మేలుకొనేవున్నాడు. వసంత చేతిలో తుపాకీ పట్టుకొని తలుపువారగా నిలబడివుంది.

టక్కున శబ్దమైంది. తలుపు మెల్లగా తెరచుకుంది. నల్లటి ఫుల్ సూట్ లోవున్న వ్యక్తి లోనికొచ్చాడు. వసంత

కర్టెన్ చాటుకు కదిలింది.

ఆగంతకుడు తలుపును వెనక్కి నెట్టి మెల్లగా ముందుకు వెళ్ళాడు. సుధాకర్ బెడ్ ప్రక్క నిలబడి, రెండుక్షణాలు పడుకున్న సుధాకర్ కేసి తదేకంగా చూడసాగాడు. తలవైపుకు నడిచివెళ్ళి, డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులులాగాడు. అందులో చకచక వెతకసాగాడు. అతనికి కావలసిందేదో అక్కడ కనుపించక పోవడంతో, మళ్ళీ సుధాకర్ వద్దకు వచ్చాడు. అతని గుండెపై కత్తివుంచి, చేతిని దిండు క్రిందికి పోనిచ్చాడు.

దిండు క్రిందనుండి లావుపాటి పుస్తకం తీశాడు. కత్తిని సుధాకర్ పైనుండి తీశాడు. మెరుపులా మంచంమీదనుండి క్రిందకు లంఘించి, ఆ హంతకుడి వెనుకనుండి రెండుచేతులు ముందుకుచాచి, అతన్ని ఇరికించి పట్టుకున్నాడు సుధాకర్.

వసంత లైట్ స్విచ్ నొక్కింది.

ఆగంతకుడి మొహాన్ని తనవేపుకు తిప్పుకున్నాడు.

"నువ్వా సుందరం?" అడిగాడు సుధాకర్.

సుందరం తలొంచుకున్నాడు.

"ఇంత సులభంగా హంతకుడు చిక్కుతాడనుకోలేదు. ఈశ్వరరావును పిల్చుకొస్తాను," అంటూ వసంత వెళ్ళింది.

"సుందరం ఈ హత్యలు నువ్వేచేశావా?" అడిగాడు సుధాకర్. "ఆఁ! నేనే చేశాను."

"నేను నమ్మను. నువ్వు అబద్ధం చెప్పుతున్నావ్?"

"సుధాకర్ గారూ! నా చరిత్ర మంచిదికాదు. మణికీ నాకు సంబంధంవుంది. సుజాతను చిన్నప్పటినుండీ ఎరుగుదును. డబ్బుమీద నాకు పిచ్చివ్యామోహం వుంది. ఇవన్నీ మీరు సులువుగా ఋజువు చెయ్యగలరు. అప్పుడు ఈ హత్యలు చేసింది నేనేనని ఎవరైనా నమ్ముతారు," అన్నాడు సుందరం.

"కాదు! హంతకుడెవరో నాకుతెలుసు. అతనే నిన్ను భయపెట్టి, నా గదిలోకి డైరీ దొంగిలించుకు రమ్మని చెప్పాడు.

నిన్ను పంపింది మురళేగదూ!'' అడిగాడు.

అంతలో ఈశ్వరరావు లోనికొచ్చాడు.

"అంతా మీరు చెప్పినట్లే జరిగింది. నేను మురళిగదిపైకెళ్ళి ఫ్లవర్ వాజ్ వెనుక దాక్కున్నాను. అతను సుందరం గది లోకి వచ్చాడు. ఇద్దరూ ఐదు నిముషాలు వాదులాడు కున్నారు. ఆ తర్వాత సుందరానికి కత్తిచ్చి మీ గదికి పంపాడు,'' అన్నాడు ఈశ్వరరావు.

"మురళిని అరెస్ట్ చెయ్యి!'' అన్నాడు సుధాకర్.

"అదింతకుముందే చేశాను. ఇందిరను చంపిన రివాల్వరు గూడా అతనివద్దే దొరికింది. తనే ఈ హత్యలు చేసినట్లు ఒప్పుకున్నాడు. హరిగదిలో డబ్బు దొంగిలించి సుందరం బెడ్ క్రింద పెట్టిందికూడా తానేనట. అతని లిస్టులోసుందరం గూడా వున్నాడు. ఆ తర్వాత తండ్రిని, మణినికూడా చంపాలనుకున్నాడు'' అన్నాడు ఈశ్వరరావు.

"తోడబుట్టిన వాళ్ళనే హత్యచేసిన మురళి అలాంటి ఘోరానికి ఎందుకు పాల్పడ్డాడు?'' అడిగింది వసంత.

"అతనికి మగతనం లేదు. అలాగని అందరూ తెలుసు కోవడం ఇష్టంలేదు. హరి వదినెతో వ్యవహారం సాగించడం మొదలుబెట్టాడు. దాం హరిని పకడ్బందీగా హత్యచేశాడు.''

"ఇందిరను చంపడంలో ఉద్దేశ్యమేమిటి?''

"అతనికి సుందరం, ఇందిర ఏదో తప్పుదోవన పడుతున్నట్లు అనుమానమేసింది. తన చెల్లెలిని వల్లోవేసుకొనగల మగతనం సుందరానికుండడం అతనికి అసూయ కలిగించింది. పైగా ఆమె నన్ను పిలిపించింది. ఈ కోపంలో ఆమెను హరీమనిపించాడు'' అన్నాడు సుధాకర్.

వసంత సామాన్లు సర్దేందుకు సిద్ధమైంది. "మీ సహాయానికి కృతజ్ఞుణ్ణి సార్!'' అన్నాడు ఈశ్వరరావు.

—: ఐ పో యిం ది :—